నమస్తే తెలంగాణ
సూర్యాపేట
I నల్లగొండ, ఆదివారం 20 ఏప్రిల్ 2025 SURYAPET

## ఎడ్లబండ్ల విశ్రాంతి స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

మద్దిరాల, ఏప్రిల్ 19 : వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సూర్యాపేట నియోజకవర్గం నుంచి ఈ నెల 22న ఎడ్లబండ్లపై రైతులు స్వచ్ఛందంగా తరలి వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గ మధ్యంలో రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు మద్దిరాల మండల కేంద్రంలో స్థలాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శనివారం పరిశీలించారు. మనుషులు, ఎద్దులకు అన్ని సౌకర్యాలు ఉండేలా స్థలం ఉండాలని పార్టీ నాయకులకు సూచించారు. రజతోత్సవ సభకు సూర్యాపేట జిల్లా నుంచి రైతులు, బీఆర్ఎస్ నాయకులు స్వచ్ఛందంగా తరలి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్, నాయకులు ఉన్నారు.



## కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేత చింతల

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 19 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రజతోత్సవ సభకు భువనగిరి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేయాలని కేటీఆర్ సూచించినట్లు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

## ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు

- తల్లీపిల్లలు క్షేమం



సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 19: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీహాన్ ఆసుపత్రిలో నిండు గర్భిణి శనివారం ఓ మహిళ ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. అందులో ఇద్దరు మగ, ఒక ఆడ శిశువు ఉన్నారు. సూర్యాపేట మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన షేక్ షబానాకు మూడేండ్ల క్రితం వివాహం జరిగింది. గర్భం దాల్చిన ఆమె కాన్పు కోసం జిల్లా కేంద్రంలోని శ్రీహాన్ ఆసుపత్రిలో చేరింది. డాక్టర్ విజిత గిరిధర్ రెడ్డి హై రిస్క్ ప్రెగ్నెన్సీగా అడ్మిట్ చేసుకొని ఆపరేషన్ చేయగా ముగ్గురు శిశువులు జన్మించారు. వారిలో ఒకరు 1.8 కిలోలు, మరొకరు 1.5, ఇంకొకరు 1.5 కిలోల బరువుతో ఉన్నారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు డాక్టర్ తెలిపారు.

# వడదెబ్బ ప్రమాదకరం... జాగ్రత్తలతోనే నివారణ సాధ్యం

Advt Special Feature...

### వారం నుంచి హడలెత్తిస్తున్న సూర్యుడు
### 38డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు

## మండుతున్న ఎండలు.. ముందు జాగ్రత్త మేలు

- ఎండ వేడితో వడదెబ్బ, చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం
- వృద్ధులు, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు



నీలగిరి, ఏప్రిల్ 19 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. 37నుంచి 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం, ఉక్కపోత ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే ఎండలు మండిపోతుండడంతో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో చర్మ వ్యాధులు, వడదెబ్బ, మూత్ర పిండాల్లో రాళ్లు, ఇన్‌ఫెక్షన్లు, గొంతు, ఒంటి నొప్పులు, చర్మం నల్లబారడం వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటికి గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆరు సంవత్సరాల్లోపు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలంటున్నారు.

### వడదెబ్బ లక్షణాలు

వేసవిలో వడదెబ్బ అతి ప్రమాదకరమైంది. మెదడులో ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ పని చేయకపోవడం వల్ల ఇది వస్తుంది. సాధారణంగా వ్యక్తి శరీర ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల ఫారెన్ హీట్. ఇంతకంటే ఎక్కువ అయితే (105 డిగ్రీల నుంచి 107 డిగ్రీల ఫారెన్ హీట్) దాటితే వడదెబ్బ వస్తుంది. మొదట తలనొప్పి, తల తిరుగడం, సరిగ్గా చూడలేకపోవడం జరుగుతుంది. రక్తపీడనం మామూలు కంటే తక్కువగా ఉంటుంది. శరీరం నుంచి చెమట కారుతుంది. ఈ సమయంలో వైద్యం అందకపోతే వ్యక్తి స్పృహ కోల్పోయి మరణించే ప్రమాదం ఉంటుంది.

### చికిత్స..

వడదెబ్బ బారిన పడిన వ్యక్తిని చల్లని ప్రదేశంలోకి చేర్చి శరీరం మీద దుస్తులను తొలగించాలి. శరీరాన్ని తడి బట్టతో తుడిచి, తడి బట్టతో కప్పాలి. ఫ్యాన్ ఉంటే పెట్టాలి. శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 102 డిగ్రీల ఫారెన్ హీట్ తగ్గే వరకు ఇలా చేయాలి. శరీర ఉష్ణోగ్రత మామూలు స్థితికి రాగానే వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లి చికిత్స అందించాలి.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎండకు బయటకు వెళ్లాల్సి వస్తే విధిగా గొడుగులను లేదా నీడ కోసం ఇతర వస్తువులను తీసుకెళ్లాలి. ఉన్ని దుస్తులను ధరించాలి. తలపాగా లేదా టోపీని ధరించాలి
- నీరసంగా ఉన్నవారు ముఖ్యంగా వృద్ధులు, పిల్లలను ఎక్కువ సేపు ఎండలోకి వెళ్లనీయవద్దు.
- ఎండలో వెళ్లాల్సి వస్తే గంటకు ఒక గ్లాసు, రోజుకు ఐదు లీటర్ల నీటిని తాగాలి. అవసరమైతే ఉప్పు, పంచదార కలిపిన నీటిని గానీ, మజ్జిగ గానీ తీసుకోవాలి.
- సీజనల్ పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగాలి.
- కూల్‌డ్రింక్స్, శీతల పానియాలు, ఐస్‌క్రీమ్‌లను పూర్తిగా నిషేధించాలి.
- 2నుంచి 6సంవత్సరాల్లోపు పిల్లలకు అరగంటకోసారి నీళ్లు తాగించాలి. 2నుంచి 4 సంవత్సరాల్లోపు పిల్లలకు రోజుకు 12నుంచి 14 గ్లాసుల నీళ్లు తాగించాలి.
- గంజిలో ఉప్పు కలుపుకొని తాగడం మంచిది.
- వేసవిలో తెల్లని, లైట్ కలర్ కాటన్ దుస్తులు ధరించాలి.
- మెడపై సూర్యరశ్మి పడకుండా టవల్స్, చున్నీ వంటివి చుట్టుకోవాలి.

### అప్రమత్తంగా ఉండాలి

వేసవిలో ముందు జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ, వేడి వల్ల సంభవించే వ్యాధులకు గురికాకుండా ఉండవచ్చు. వాతావరణంలో వచ్చిన మార్పులతోపాటు ఉష్ణోగ్రతలు పెరుగడంతో చర్మ వ్యాధులు, వడదెబ్బ, డీ హైడ్రేషన్, మూత్ర పిండాల్లో రాళ్లు, శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. నీటిని బాగా తాగడంతోపాటు చలువ కోసం కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలి. శరీర నీటి శాతం పెంచే పుచ్చ, కర్బూజను బాగా తినాలి. మజ్జిగ బాగా తాగాలి. వేసవి దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా 40వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం.

**- డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, నల్లగొండ**












































